క్లుప్తంగా

లలితాదేవికి ఏకాంత సేవ



లలితా అమ్మవారు

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో కొలువైన లలితాదేవి అమ్మవారి ఏకాంత సేవ ప్రతి రోజు రాత్రి 8.45 గంటలకు జరుగుతుందని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణ సేస్ తెలిపారు. ఏకాంత సేవలో ఇద్దరిని మాత్రమే అనుమతిస్తామని, పాల్గొన్న వారికి అమ్మవారి శేషవస్త్రం అందజేస్తామని ఆయన చెప్పారు. నంది మండపంలోకి అనుమతిస్తామని, ఏకాంత సేవలో పాల్గొన దలచిన భక్తులు పీఠం కార్యాలయంలో గానీ, 98492 86779 నంబర్‌లో గానీ సంప్రదించాలని కోరారు.

నేడు వైశాఖ పౌర్ణమి పూజలు

వైశాఖ శుద్ధ పౌర్ణమి సందర్భంగా లలితానగర్ లలితా పీఠంలో శుక్రవారం ఉదయం 5 గంటలకు శ్రీలక్ష్మీ నరసింహస్వామికి అభిషేకం, అర్చన నిర్వహిస్తామని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు మణిద్వీపంలో మహా నేరువుకు శ్రీచక్రనవావరణ అర్చన, 9 గంటలకు షోడసి సహిత లలితాదేవి హోమం జరుగుతుందని చెప్పారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొన దలచిన భక్తులు పీఠం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

బుద్ధ జయంతి నేడు



ముస్తాబైన బుద్ధుడి విగ్రహం

కంచరపాలెం: ఆంధ్ర బౌద్ధ కేంద్ర సమాజం ఆధ్వర్యంలో శుక్రవారం వైశాఖ పౌర్ణమి బుద్ధ జయంతి వేడుకలు నిర్వహించనున్నారు. ఈ మేరకు కంచరపాలెం అశోక్‌నగర్‌లోని బౌద్ధాలయంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు యూత్ సెంటర్ గౌరవ అధ్యక్షుడు, సమాజం కార్యదర్శి కె.రాజు గణేష్ తెలిపారు. ఈ సందర్భంగా బౌద్ధ బిక్షువులచే బౌద్ధ సూక్తులతో పూజలు, ప్రసాద వితరణ, అనంతరం వృద్ధులకు చీరల పంపిణీ, పేదలకు అన్నదానం, చలివేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. బౌద్ధాలయం, బుద్ధుడి విగ్రహానికి రంగులు వేసి సుందరంగా అలంకరించామన్నారు.

14న హనుమాన్ జయంతి వేడుకలు



భక్తాంజనేయ స్వామి

సీతమ్మధార: ఈ నెల 14న హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయంలో కొలువైన భక్తాంజనేయ స్వామికి ఆరోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రత్యేక అభిషేకం చేస్తున్నట్లు ప్రధాన అర్చకుడు రాజాస్వామి తెలిపారు. అనంతరం సింధూర పూజ, తమలపాకులు, వడమాలతో పూజలు జరపనున్నట్లు చెప్పారు.

వైభవ వేంకటేశ్వరుడికి నేడు పంచామృతాభిషేకం



మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో కొలువైన వైభవ వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు శుక్రవారంతో ముగియనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. శుక్రవారం పౌర్ణమి సందర్భంగా ఉదయం 6.30 గంటలకు ఆర్జిత సేవలో పాల్గొన్న భక్తులు, దాతలు మంగళ ధ్వనితో వేదమంత్రోచ్ఛారణల మధ్య అభిషేక ప్రదక్షిణ చేస్తారు. అనంతరం శ్రీవారికి విశేష ద్రవ్యాలతో పంచామృతాభిషేకం నిర్వహిస్తారు. స్వామిని సర్వాంగ వజ్రకవచంతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తారు. హారతి, తీర్థప్రసాద గోష్ఠి నిర్వహిస్తారు. శనివారం సుప్రభాత సేవ అనంతరం అలవేలు మంగ అన్నసమారాధన భవనంలో భక్తులకు అన్నసమారాధన ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ట్రాఫిక్ కష్టాలు తీరేదెన్నడో..!

- కంచరపాలెం వై జంక్షన్‌లో గందరగోళంగా వాహనాల రాకపోకలు
- దిష్టిబొమ్మల్లా ట్రాఫిక్ సిగ్నల్ స్తంభాలు
- కానరాని జీబ్రా క్రాసింగ్స్ జాడ
- ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు
- ఇబ్బందులు పడుతున్న పాదచారులు, వాహన చోదకులు



వాహనాల రద్దీతో కంచరపాలెం కూడలి



స్టాపర్ బోర్డులు లేనిచోట ప్రమాదకరంగా వై జంక్షన్ రహదారులు

కంచరపాలెం: కంచరపాలెం మెట్టు వై జంక్షన్‌లో ట్రాఫిక్ చిక్కులు అధికమవుతున్నాయి. ఇక్కడి నేతాజీ ఫ్లైఓవర్ వంతెన కూడలి ముత్యమాంబ ఆలయం వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రయాణికులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూడలి నుంచి అటు జ్ఞానాపురం, ఇటు తాటిచెట్లపాలెం వెళ్లే వాహనాలు కూడలి మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. నిత్యం జన సంచారం ఎక్కువగా ఉంటుంది. స్కూల్స్ జోన్ ఉన్నా.. ట్రాఫిక్ సిగ్నల్స్, జీబ్రా క్రాసింగ్స్ జాడే కనపడటం లేదు. ఉదయం, సాయంత్రం వేళల్లో వివిధ వాహనాలతో ఈ వై జంక్షన్ కిటకిటలాడుతుంటుంది. భారీ వాహనాలు నిషిద్ధ సమయాల్లో నగరంలోకి పంపకుండా ఇక్కడే నిలిపివేస్తుంటారు. దీంతో అనేక వాహనాలు రహదారిపై ఆగిపోతుంటాయి. ఇక్కడ నుంచి తొందరగా వెళ్లాలని ప్రయత్నిస్తున్న పలువురు వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల ప్రమాదాలు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయి. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి సరిపడ ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది లేకపోవడంతో సమస్య తీవ్రంగా ఉంది. నిబంధనలకు విరుద్ధంగా భారీ వాహనాలు ప్రయాణించేటప్పుడు ప్రమాదాలను ఎక్కువగా జరుగుతున్నాయని పలువురు వాపోతున్నారు.

పూర్తికాని బీఆర్‌టీఎస్..

కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ నుంచి ఊర్వశికూడలి, ఐటీఐ జంక్షన్ వరకు చేపట్టిన బీఆర్‌టీఎస్ రహదారులు పూర్తి కాకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. తోపుడుబళ్లు, చిల్లర వర్తకులు రోడ్లపై వ్యాపారాలు చేస్తుండడంతో రహదారులు కుదించుకుపోతున్నాయి. ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు చర్యలు తీసుకోకపోవడంతో ట్రాఫిక్ మరింత జటిలమవుతోంది. కూడలిలో ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేస్తున్నవారికి హాకర్స్ జోన్ ఏర్పాటు చేస్తే ట్రాఫిక్ నియంత్రించవచ్చునని స్థానికులు చెబుతున్నారు.

ఆటోలతో ట్రాఫిక్‌కు అడ్డంకులు.

ఇక్కడ ఉన్న ముత్యమాంబ ఆలయ ప్రాంగణంలో ఆటోస్టాండ్ వద్ద ఆటోలను అడ్డంగా నిలుపుదల చేస్తూ బేరసారాలు చేస్తున్నా, ట్రాఫిక్ సిబ్బంది మాత్రం తమకేమి పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. పండగలు, సంబరాలు, జాతరల సమయాల్లో మాత్రమే పోలీసు యంత్రాంగం ట్రాఫిక్ క్రమబద్ధీకరించే చర్యలు తీసుకుంటున్నారు తప్ప మిగతా సమయంలో అసలు పట్టించుకోవడం లేదు. ఇటీవల కాలంలో ఇక్కడ పోలీస్ కంట్రోల్ పోస్టును ఏర్పాటు చేసినా నామమాత్రంగానే పని చేస్తోందని, ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మల్ల అప్పారావు ప్రమాదాల నియంత్రణపై కౌన్సెలింగ్ ఇస్తున్నా డ్రైవర్లలో ఎలాంటి మార్పురావడంలేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.



పనిచేయని ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు

జంక్షన్ దాటాలంటే భయం

పాఠశాలకు వెళ్లేటప్పుడు కంచరపాలెం మెట్టు వై జంక్షన్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్ లేకపోవడంతో రోడ్డు దాటాలంటేనే భయం వేస్తోంది. పెద్దల సహాయంతో రోడ్డు దాటుతున్నాం. ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసి ట్రాఫిక్ పోలీసులను నియమించాలి.

– పి.పద్మప్రియ, విద్యార్థిని, కంచరపాలెం

పిల్లలను పంపాలంటే ఆందోళన

కొండవాలు ప్రాంతాల్లో ఉన్నత పాఠశాలల లేకపోవడంతో పిల్లలను కంచరపాలెం కూడలిలో పాఠశాలలకు పంపుతున్నాం. కూడలిలో ట్రాఫిక్ సిగ్నల్స్ లేకపోవడంతో రోడ్డు దాటుతున్నప్పుడు ప్రమాదాల బారిన పడుతున్నారు. రహదారులపై నడవాలంటేనే చిల్లర వర్తకులు, తోపుడుబళ్లతో ఇబ్బందికరంగా ఉంటుంది.

– కె.ఆర్.గణేష్, అశోక్‌నగర్

ట్రాఫిక్ సిబ్బందిని నియమించండి

కంచరపాలెం మెట్టు వై జంక్షన్‌లో భారీ వాహనాలు నిత్యం వందల సంఖ్యలో ప్రయాణిస్తున్నాయి. రహదారులను దాటుకుని ప్రయాణించాలంటే నరకయాతన తప్పడం లేదు. ట్రాఫిక్ సిబ్బందిని మరింత పెంచాలి. సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి. ప్రమాదాలబారి నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలి.

– జి.వీరలక్ష్మి, గణేష్‌నగర్

నేటి నుంచి సుబ్రహ్మణ్యస్వామికి పౌర్ణమి పూజలు



సుబ్రహ్మణ్య స్వామి

కంచరపాలెం: వైశాఖ పౌర్ణిమను పురస్కరించుకుని ఈ నెల 5 నుంచి 7 వరకు ఊర్వశి జంక్షన్ రవీంద్రనగర్‌లోని సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు దేవాల రాజుకృష్ణ తెలిపారు. ఆలయంలో గురువారం ఆయన వివరాలు వెల్లడించారు. శుక్రవారం ఉదయం కలశ స్థాపన, విఘ్నేశ్వర పూజ, మండపారాధన, ముత్తయిదువుల చేతుల మీదుగా ఊంజల్ సేవ జరుగుతాయని చెప్పారు. అనంతరం స్వామికి క్షీర, పంచామృతాభిషేకాలు, స్కందవేద హోమం తదితర పూజలు చేస్తామన్నారు. 6న సుబ్రహ్మణ్య స్వామికి విశేష పూజలు, 7న ఆదివారం మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నదానం, సాయంత్రం స్వామి తిరువీధి మహోత్సవం నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఆలయానికి రంగులు వేసి విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించామని చెప్పారు. కార్యక్రమంలో కాండ్రేగుల రాము, సిహెచ్.కుమారి, కె.రవి, సిహెచ్.సురేష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



గుండ్రని దస్తూరిపై శిక్షణ పొందుతున్న చిన్నారులు

కంచరపాలెం: ఊర్వశి కూడలి కంచరపాలెం బొట్టా నర్సింగరావు భవనంలో వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్, బీఎన్ఆర్ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో గురువారం వేసవి శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ నెల 31 వరకు నిర్వహించ ఈ శిబిరాల్లో విజ్ఞానంతో కూడిన వినోదత్మాక అంశాలపై శిక్షణ ఇస్తామని నిర్వాహకులు తెలిపారు. సమ్మర్ క్యాంప్‌ను విద్యార్థులు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని కంచరపాలెం జోన్ కమిటీ సభ్యుడు కృష్ణారావు కోరారు.

సీతంపేటలో వాక్ ఇన్ డ్రైవ్ నేడు

సీతంపేట: శ్రీకృష్ణ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 3 గంటల వరకు మెగా వాక్ ఇన్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు సంఘం ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. సీతంపేట కనకమ్మ ఆలయం పక్కన గల ఎస్‌కేవైఎస్ఎస్ ఫంక్షన్ హాల్లో డ్రైవ్ జరుగుతుందన్నారు. బీపీవో, ఐటీ, ఎలక్ట్రికల్, ఫార్మా రంగాల్లో ఉద్యోగాలకు ఎంపిక నిర్వహిస్తారని, ఏదైనా డిగ్రీ, బీటెక్, ఇంటర్, డిప్లొమా విద్యార్థులు పాల్గొనవచ్చని చెప్పారు. జీతం నెలకు రూ.12 వేల నుంచి రూ.25 వేల వరకు ఉంటుందన్నారు. వివరాలకు 85559 78384, 91775 99194 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

క్రీస్తును ఆరాధిస్తూ ప్రార్థనలు



క్రీస్తు గీతాలు ఆలపిస్తున్న పాస్టర్ కామినాయుడు, జోసఫ్

సీతంపేట: గాడ్ మెస్సీయా సంఘం వ్యవస్థాపకుడు పాస్టర్ జి.కామినాయుడు ఆధ్వర్యంలో గురువారం అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్‌లోని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక వాక్యం, దైవ సందేశమిచ్చారు. పాస్టర్లు జోసఫ్ నాయుడు, లతా నీలు క్రీస్తును ఆరాధిస్తు గీతాలు ఆలపించారు. స్థానిక క్రైస్తవులు పాల్గొని ప్రార్థనలు చేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



మాట్లాడుతున్న దుర్గేష్‌కుమార్



పద్యాలు ఆలపిస్తున్న చిన్నారులు



నృత్యం చేస్తున్న హంస అకాడమీ విద్యార్థులు

- పద్యాలాపన, నృత్యాలతో ఆకట్టుకున్న హంస అకాడమీ విద్యార్థులు

తాటిచెట్లపాలెం: సాలగ్రామపురంలోని పోర్టు సాగరమాల కన్వెన్షన్ హాల్‌లో గురువారం హంస అకాడమీ ఆఫ్ మ్యూజిక్, స్క్రిప్చర్ అండ్ ఆర్ట్స్ వార్షిక వేడుకలు ఘనంగా జరిగాయి. నరసింహ జయంతి, త్యాగరాజ జయంతి సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వేడుకలను ముఖ్య అతిథి విశాఖపట్నం పోర్టు అథారిటీ డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబే ప్రారంభించి మాట్లాడారు. చిన్నారులు విద్యతోపాటు ఇటువంటి పలు ప్రత్యేక అంశాల్లో కూడా నిష్ణాతులు కావాలని సూచించారు. హంస అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ రామ్‌ప్రసాద్ రచించిన థీమ్ సాంగ్ చిన్నారి చిలుకులము ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సంగీత విద్వాంసురాలు మండ సుధారాణి ఈ పాటకు శ్రావ్యమైన సంగీతం సమకూర్చారు. సాయంత్రం జరిగిన కార్యక్రమాలను మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, బీజేపీ నాయకుడు చెరువు రామకోటయ్యలు ప్రారంభించారు.

ఏకధాటిగా 80 పద్యాల ఆలాపన

ఐదేళ్ల నుంచి 22 ఏళ్ల వయసు గల సుమారు 50 మంది విద్యార్థులు పోతన భాగవతంలోని ప్రహ్లాద చరితము నుంచి 80 పద్యాలను ఏకధాటిగా వినిపించారు. ఆరుగురు చిన్నారులు అత్యంత సంక్లిష్టమైన నృసింహ గద్య పఠనం చేశారు. నృసింహ జయంతి సందర్భంగా సింహాచలం దేవస్థానం అర్చకుడు నృసింహ స్వామిజీ పూజలు జరిపారు. అనంతరం త్యాగరాజ సంస్మరణ కార్యక్రమంలో భాగంగా సుమారు 40 మంది చిన్నారులు త్యాగరాజ కృతులపై అంత్యాక్షరి నవల నిర్వహించారు. సంస్థ కార్యదర్శి ఎస్ఎల్ఎన్ శాస్త్రి నివేదికను సమర్పించారు. వివిధ సంస్థల్లో నృత్యం నేర్చుకుంటున్న బాలికల బృందాలు ఉత్తుకాడ్ వెంకట సుబ్బయ్య పాటలను ప్రదర్శించాయి. వీపీఏ డిప్యూటీ చైర్మన్‌ను సంస్థ అధ్యక్షులు ఘనంగా సత్కరించారు.

రక్షణగిరి మహోత్సవాలకు సిద్ధం

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ కెథడ్రిల్ చర్చి ఆధ్వర్యంలో రక్షణగిరి పుణ్యక్షేత్ర ప్రధాన మహోత్సవం ఈ నెల 14న నిర్వహించనున్నామని పునీత రాయప్ప ప్రధాన దేవాలయం విచారణకర్త రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ తెలిపారు. ప్రతిఏటా ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్న ఈ ఉత్సవాలు శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ఫాదర్ దుగ్గింపూడి బాలశౌరి చేత పతాకావిష్కరణతో ప్రారంభమవుతుందన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

మురళీనగర్: మర్రిపాలెం సెక్షన్ పరిధిలోని బాపూజీనగర్, గ్రీన్ గార్డెన్స్ 11 కేవీ ఫీడర్ల నిర్వహణ పనుల కారణంగా శనివారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్–2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు బాపూజీనగర్, పార్వతీనగర్, హుస్సేన్‌నగర్, పంజాబ్ హోటల్ కూడలి, గ్రీన్ గార్డెన్స్, సాయినగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

మూడేళ్లయినా ఆచూకీ లేకపోవడంతో ఫిర్యాదు



గండి అజిత్

మర్రిపాలెం: మూడేళ్లయినా తన కుమారుడి ఆచూకీ తెలియలేదని గురువారం అతడి తండ్రి కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం చాకలిగెడ్డ ప్రాంతానికి చెందిన గండి అజిత్ పెయింటర్‌గా పనిచేస్తూ ఉండేవాడు. 2020 డిసెంబర్‌లో ఇంట్లో నుంచి వెళ్లిన అతడు నేటికీ ఇంటికి చేరుకోలేదు. దీంతో తండ్రి గండి రాయప్ప పోలీసులను ఆశ్రయించాడు. తొలుత నగర పోలీస్ కమిషనరేటర్‌కు వెళ్లగా.. కేసు నమోదు చేసుకోమని సూచించారు. కొడుకు అదృశ్యమైన మూడేళ్లకు తండ్రి పోలీసుకు ఫిర్యాదు చేశాడు. సీఐ విజయ్‌కుమార్ నేతృత్వంలో ఉమెన్ హెడ్ కానిస్టేబుల్ కష్టకుమారి కేసు దర్యాప్తు చేపట్టారు.

బాలికను రక్షించిన లైఫ్ గార్డ్‌లు

అల్లిపురం: బీచ్‌లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన బాలికను బీచ్ లైఫ్ గార్డ్స్ రక్షించారు. మహారాణిపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయనగరానికి చెందిన మైనర్ ఒకరు ఉదయం నొవోటెల్ హోటల్ వద్ద బీచ్‌లోకి నడుచుకుంటూ వెళ్లి ఆత్మహత్యకు ప్రయత్నించగా అక్కడే ఉన్న లైఫ్‌గార్డ్స్ రాజు, కల్యాణ్, పోలిరాజులు రక్షించి మహారాణిపేట పోలీసులకు అప్పగించారు. దీంతో పోలీసులు బాలికకు కౌన్సెలింగ్ ఇచ్చి, తల్లిదండ్రులకు అప్పగించారు. ప్రేమ వ్యవహారం కారణంగానే బాలిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు పోలీసులు వెల్లడించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



49వ వార్డులో సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందిస్తున్న కె.కె రాజు, అల్లు శంకరరావు

మర్రిపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 49వ వార్డులో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. 282 సచివాలయం పరిధి బర్మాక్యాంప్, పీఆర్ గార్డెన్స్, మాణిక్యాంబ కాలనీ, చాకలిగెడ్డ ప్రాంతాల్లో జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ అల్లు శంకరరావుతో కలిసి ఆయన ప్రతి గడపకు వెళ్లారు. ఇప్పటి వరకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ప్రజల సమస్యలను తక్షణం పరిష్కరించేందుకు, చివరి లబ్ధిదారు వరకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరాలని సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలోని మొత్తం 175 నియోజకవర్గాల్లో గడప గడపకు మన ప్రభుత్వం చేపట్టారన్నారు. ప్రజల సమస్యలను నేరుగా ప్రజాప్రతినిధులు తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. తద్వారా ఆయా సమస్యల పరిష్కారం దిశగా చర్యలు చేపడతారని చెప్పారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ఐ.రవికుమార్, రాయుడు శ్రీను, నూకరాజు, 49వ వార్డు నాయకులు ఢిల్లీరావు, రాము, సరస్వతమ్మ, పావని, రాంబాబు, ఏసు, ఆచారి, మున్నా, సుబ్బలక్ష్మి, మస్తాన్, దేవుడు, హైమ, సీనియర్ నాయకులు షేక్ బాబ్జి, కె.చిన్న, వసంతల అప్పారావు, సబ్బవరపు శ్రీను, గురువోజి, కర్రి రామారెడ్డి, జక్కంపూడి సత్యనారాయణ, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సమయపాలన తప్పనిసరి

యూపీహెచ్‌సీ వైద్య సిబ్బందితో డీఎంహెచ్‌వో



శివనగర్ ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బంది అందరూ సమయపాలన తప్పనిసరిగా పాటించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశించారు. మర్రిపాలెం శివనగర్ ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆయన ఆకస్మిక తనిఖీలు చేశారు. రికార్డులు, మందుల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమీక్షలో డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు మాట్లాడుతూ అన్ని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. బర్త్ ప్లానింగ్ గురించి, హైరిస్క్ గర్భిణులను గుర్తించి డాక్టర్ల సలహా నిమిత్తం ఐరన్ ఫోలిక్ మాత్రలు, పోషకాహారం తీసుకునేటట్లు ప్రోత్సహించాలన్నారు. సాధారణ ప్రసవాలు అయ్యేలా ప్రోత్సహించాలని, శస్త్రచికిత్స ప్రసవాలను తగ్గించాలని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది అందరూ డ్రెస్ కోడ్ పాటించాలని పలు సూచనలిచ్చారు. యూపీహెచ్‌సీ వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

త్వరితగతిన డ్రైనేజీల నిర్మాణం



అశోక్‌నగర్‌లో జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులు

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డులోని ధర్మానగర్, తిక్కవానిపాలెం, జోగారావునగర్, అశోక్‌నగర్, కొత్తరెడ్డి కంచరపాలెం, జాషువానగర్ ప్రాంతాల్లో డ్రైనేజీ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. జోన్–5 ఇంజినీరింగ్ విభాగం ఈఈ శ్రీనివాసరావు, డీఈ భరణికుమార్, ఏఈ అర్చన గురువారం వీటిని పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఈఈ శ్రీనివాసరావు సూచించారు. డ్రైనేజీలను ఆక్రమించి నిర్మించిన గోడలు, మెట్ల తొలగింపులో కొంత మేర జాప్యం జరుగుతోందని వర్క్ ఇన్‌స్పెక్టర్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నో ఏళ్లుగా శిథిలావస్థలో ఉన్న కాలువలు, డ్రైనేజీలకు మోక్షం లభించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హరిద్వార్‌లో ‘అన్నమాచార్య ట్రస్ట్’ ప్రదర్శనలు



సంకీర్తనలు ఆలపిస్తున్న అన్నమాచార్య సేవా ట్రస్ట్ బృందం



కోలాటమాడుతున్న ట్రస్టు సభ్యులు

సీతంపేట: గంగా పుష్కరాల సందర్భంగా హరిద్వార్‌లో కేంద్ర ప్రభుత్వం, రేఖాస్ ఇంటర్నేషనల్ సంయుక్తంగా నిర్వహించిన కార్నివాల్ ఆఫ్ ఇండియన్ కల్చర్ కార్యక్రమంలో నగరానికి చెందిన శ్రీవెంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ వారి బృందం అన్నమాచార్య సంకీర్తనలు, కూచిపూడి నృత్యం, కోలాటం ప్రదర్శించారు. సేవా, సాంస్కృతిక ప్రదర్శనల్లో ఆద్యంతం బృంద సభ్యులు ఆకట్టుకున్నారని రేఖాస్ ఇంటర్నేషనల్ చైర్మన్ కలువ చంద్రశేఖరరావు ప్రశంసించారు. వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్ సునీత కొటారి, టీం లీడర్ పద్మజావల్లి పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్ పరిశుభ్రం

సాక్షి ఎఫెక్ట్..



వాకింగ్ ట్రాక్‌ను శుభ్రం చేయిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ సన్యాసినాయుడు

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు సత్యం సెంటర్ సమీపంలో హైవేకు ఆనుకుని ఉన్న గ్రీన్‌బెల్ట్‌లోని వాకింగ్ ట్రాక్‌ను గురువారం ఉదయం పారిశుద్ధ్య కార్మికులు శుభ్రం చేశారు. ‘సమస్యల్లో వాకింగ్ ట్రాక్’ శీర్షికన గురువారం ‘సాక్షి’లో ప్రచురించిన కథనానికి వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.సన్యాసినాయుడు స్పందించారు. సిబ్బంది చేత వాకింగ్ ట్రాక్‌ను, పరిసరాలను శుభ్రం చేయించి చెత్తాచెదారం తరలించారు. వాకింగ్ ట్రాక్‌కు రక్షణగా గణేష్‌నగర్ రోడ్ వైపు గోడ ఎత్తు చేయడం, ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం వంటి అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి అనుమతి కోసం పంపిస్తామని కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ తెలిపారు. వాకింగ్ ట్రాక్‌లో ప్రమాదకరంగా ఉన్న ఫ్యూజ్ బాక్సును తొలగించాలని విద్యుత్ శాఖ ఏఈ స్రవంతిని ఆదేశించామన్నారు. మందుబాబుల ఆగడాలను నియంత్రించాలని ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ సీఐ సింహాద్రి నాయుడిని కోరగా.. గస్తీ ముమ్మర చేస్తామని చెప్పారన్నారు.